# మగవాళ్లకి మాత్రమే

"యూ బ్లడీ బిచ్! గెటవుట్! గెటవుట్ ఫ్రం మై హౌస్!"

ఒళ్లు తెలీని కోపంతో అరిచాను. రమ మాటలు విన్పించుకోకుండా ఆమె జుట్టు పట్టుకుని ఈడ్చి బలవంతాన బయటికి తోసేసి తలుపు లేసేశాను.

ఆమె ఏడ్చింది. తలుపు బాదింది. బతిమాలింది.

నేను కరగలేదు. కనికరించదలచలేదు.

అలాటి ఆడదానికి అలాంటి శిక్ష విధించడమే న్యాయం.

తలుపు చప్పుడు ఆగిపోయింది. ఆమె స్వరమూ విన్పించట్లేదు. బహుశా వెళ్లిపోయుంటుంది. నా ఇంటి నుంచే కాదు. ఈ పరిసరాల్నుంచే వెళ్లిపోయుంటుంది. నా జీవితం నుంచి కూడా శాశ్వతంగా నిష్క్రమించి ఉంటుంది!

ఎంతో హాయిగా, రిలీఫ్‌గా అన్పించింది. బంధనాల నుండి విముక్తి లభించినట్టు ఎంతో ఫ్రీగా ఉంది.

సోఫాలో అడ్డంగా పడుకున్నాను. సిగరెట్ తాగాలన్పించింది. అవునిప్పుడు నేను స్వతంత్రుడ్ని. ఏం చేయాలనుకుంటే అది చేయగలను!

వెదకగా పుస్తకాల అల్మారాలో సిగరెట్ పాకెట్ కన్పించింది. ఒకటి తీసి వెలిగించి గుండెల్నిండా పొగ పీల్చుకున్నాను.

ఓహ్! ఎంత గొప్ప అనుభూతి!

న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి - అన్నది మనువు కాలంలోనే కాదు. ఏ కాలంలోనైనా సరే వాంఛనీయమే. స్వానుభవంతో నేను గ్రహించిన సత్యం ఇది. వేడి రక్తపు యువదశలో అదంతా ట్రాష్ అనీ ఆడా మగా అంతా సమానమేననీ ఏదేదో అనుకుంటాం. కథలూ, కవితలూ రాస్తాం. ఉపన్యాసాలు దంచి చప్పట్లూ, అభినందనలూ చేజిక్కించుకుంటాం.

కాని ఆడదానికి స్వేచ్ఛ ఇస్తే మగాడు ఆమెకి బానిస కాక తప్పదు. ఆమెకి సాంఘికంగా ఆర్థికంగా ఏ రకమైన స్వేచ్ఛా ఇవ్వనప్పుడే ఇల్లు స్వర్గమవుతుంది. ఇంటి యాజమాన్యం మగాడికి దక్కుతుంది.

అలాగాక కళ్లాలు వదలినట్లయితే ఆడది కదను తొక్కుతుంది. మన మంచితనాన్ని బలహీనతగా భావించి రెచ్చిపోతుంది. మనల్ని వెధవల్ని చేసి ఆడించాలని చూస్తుంది. ఎదురు తిరిగితే కరివేపాకులా తీసి పారేస్తుంది. వీథెక్కి కన్నీళ్లు కార్చి బోలెడు సానుభూతినీ. రక్షణనీ మూట గట్టుకుని మనల్నే విలన్‌గా నిలబెడుతుంది!

బివేర్ ఆఫ్ లేడీస్!

ఎస్. నిజమే. ఆడమ్-ఈవ్‌ల కాలం నుంచీ జరుగుతోందదే. మగాడ్ని పతన దిశగా నడిపిస్తోంది ఆడది. అతడ్ని పాదాక్రాంతం చేసుకుని చక్రం తిప్పాలనీ, వీలైతే మగాడి భుజాలెక్కి స్వారీ చెయ్యాలనీ చూస్తోంది!

రియల్లీ ఎ డేర్ డెవిల్!

అన్నం ఉడికిందో లేదో చెప్పడానికి ఒక్క మెతుకు పట్టుకుని చూస్తే చాలు. ఆడవాళ్లలో దాగున్న అసలు నైజం తెలియజెప్పడానికి ఒక్క రమ చాలు.

రమ కొద్ది నిమిషాలు క్రితం వరకూ నా భార్య. నా ఇల్లాలు. నా సర్వస్వం. కానిప్పుడు నాకేమీ కాదు!

నాలుగేళ్ల క్రితం ఎంతో పెద్ద మనస్సుతో, విశాలదృక్పథంతో రమని నా జీవితంలోకి ఆహ్వానించాను. ఎంతో మెత్తగా, ముగ్ధగా, అమాయకంగా, లేత తమలపాకులా ఉందని భ్రమించాను.

ఎమ్మార్వో ఆఫీసులో అసిస్టెంటుగా పనిచేస్తోన్న నాకు ఎన్నో పెళ్లి సంబంధాలొచ్చాయి. పైరాబడి సంగతి బహిరంగ రహస్యం గనుక కట్నం లక్షల్లో ఇస్తామని ఎందరో వచ్చారు.

అప్పుడే రమ సంబంధం వచ్చింది.

ఆమె ఓ బ్యాంకులో గుమాస్తాగా పనిచేస్తోంది. ఇస్తామన్న కట్నం కూడా తక్కువే. అయినప్పటికీ కట్నకానుకల విషయంలో చాలా ఉదారంగా వ్యవహరించాం. లేడి పిల్లలా ఉంది కదాని ఆమె వైపు మొగ్గేను. వేణ్నీళ్లకి చన్నీళ్లలా ఆమె జీతం కలిసొస్తుందిలే అనుకున్నాను. ఎప్పుడు ఇష్టం లేకపోతే అప్పుడు ఉద్యోగం మాన్పించొచ్చు కదా అని తలచాను. భర్త మాట వేదవాక్కులా శిరసావహించే కుటుంబం నుంచి వచ్చింది కదా అని సంతోషపడ్డాను.

అప్పటికీ మా అమ్మ మొత్తుకుంది. చదువుకున్న అమ్మాయిలకి షోకుల మీదే శ్రద్ధ అనీ, ఉద్యోగాలు వెలగబెట్టే ఆడవాళ్లు కాపురాలు సరిగ్గా చెయ్యరూ అవటాని.

"ఆవిడ జీతం ఆవిడ చీరలకీ, స్నో పౌడర్లకీ సరిపోతుందిరా, నీ మంచి చెడూ చూసే ఓపికా, తీరికా ఉండవురా" అని కూడా అంది.

అయినా నేను విన్పించుకోలేదు. లోకానుభవంతో అమ్మ చెప్పిన మాటల్ని బూజు పట్టిన ఛాందస భావాలుగా కొట్టి పారేశాను.

ఏమైతేనేం, రమతో నా పెళ్ళయ్యింది.

మొదటి రాత్రి... కలల తొలి వలపు రాత్రి... గదిలో అడుగు పెడుతూనే తన నైజాన్ని బయట పెట్టేసింది.

సిగ్గు బరువుతో వంగిపోతూ పాల గ్లాసుతో అడుగు పెట్టాలి. పాదాభివందనం చెయ్యాలి. మీరు నా నూరేళ్ల పంట అవడం అదృష్టమని పొంగిపోవాలి. తక్కువ కట్నానికి అంగీకరించినందుకు కృతజ్ఞతలు చెప్పాలి జన్మజన్మలకీ మీరే నా భర్త కావాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నానని మనస్ఫూర్తిగా చెప్పాలి.

రమ స్థానంలో మరొకరుంటే నాలాంటి భర్త లభించినందుకు తప్పకుండా అలాగే చేసేది. కాని రమ అందర్లాటిది కాదు గనుక నన్ను సమీపిస్తూనే "నాకు సిగరెట్ల వాసన పడదండీ. ప్లీజ్ మానెయ్యరూ?" అని అడిగేసింది.

తన అధికారాన్ని తెలియజేయడానికి చాలా తెలివిగా మొదటి రాత్రిని ఎన్నుకుంది. పిచ్చివాడ్ని. అదంతా నా మీద కారిపోతున్న ప్రేమ అనీ, నా ఆరోగ్యం మీద తనకి గల అభిమానానికి తార్కాణమనీ, ఏదేదో ఊహించుకుని 'సరే' అని వాగ్దానం చేసేశాను!

"చెయిన్ స్మోకర్ మూర్తిగాడు సిగరెట్లకి గుడ్‌బై చెప్పేడంటే పెళ్లాం చేతిలో కీలుబొమ్మ అయిపోయాడన్నమాటే" అన్నారు ఫ్రెండ్స్.

"మూర్తి ఇహ ఉత్సవమూర్తే" అన్నారు కొలీగ్స్.

"రమ చాలా తెలివైంది. పెళ్లైన మర్నాడే మొగుడి చేత సిగరెట్లు మాన్పించింది." చెవులు కొరుక్కున్నారు అమ్మలక్కలు.

ఎవరేమనుకున్నా నేను లెక్క చేయలేదు. ఆమె ఉద్దేశాన్ని శంకించనూలేదు. ఆ పనిలో మంచి ఉంది. ఆ కోరిక వెనుక మమకారం ఉంది అని భావించానంతే.

నిజం చెప్పాలంటే రమా వాళ్ల పుట్టింటి వాళ్లు మా తాహతుకి తగ్గవాళ్లు కాదు. ఆ సంగతి తూతూ మంత్రంగా చేసిన పెళ్లిలోనే తెలిసిపోయింది. కాని మరీ ఇంత

పిసినారులను కోలేదు. పెట్టుపోతల్లో సారెచీరల్లో అన్నిటా దిగజారుడుతనమే. లోభత్వమే. అల్లుడ్నీ వియ్యాలవార్నీ తృప్తి పరచాలన్న కనీస జ్ఞానం కూడా వారికి లేదని ఖచ్చితంగా చెప్పగలను.

ముందొకసారి చెప్పినట్టు నాది సంకుచిత స్వభావం కాదు కాబట్టి వాటినంత సీరియస్‌గా పట్టించుకోలేదు. పట్టించుకుని ఉంటే మా ఇంట్లో వేధింపులూ, చిత్రహింసలూ, కిరసనాయిలూ - అగ్గిపుల్లా కథ జరిగితీరేది!

రమని మనస్ఫూర్తిగా ప్రేమించాను. అర్ధాంగిగా గౌరవించాను. ఇంటి పనుల్లో ఎంతో కొంత చేదోడయ్యాను. మగ పౌరుషానికి భంగం కలగనంత మేర మసిలాను.

కాని తనెన్నో ఆంక్షలు విధించేది. సోఫాలో అడ్డదిడ్డంగా పడుకోకూడదు. పుస్తకాల రాక్‌లోని పుస్తకాల్ని చెల్లాచెదురు చెయ్యకూడదు. ఊరికే డబ్బు తగలేసి షో కేసు బొమ్మల్ని కొన్నా ఏమనకూడదు. తడి చేతుల్ని కర్టెన్లకి పొరపాటున కూడా తుడవకూడదు. ఆఫీసయ్యాక సరదాలంటూ, పేకాటకీ సినిమాలకీ చెక్కెయ్యకూడదు - ఇలా ఎన్నో!

మర్యాదాపురుషోత్తముడి పేరు పెట్టుకున్న శ్రీరామచంద్రమూర్తిని గనుక ఆమె అభిప్రాయాలని గౌరవించాను. మర్యాద ఇచ్చాను.

సాధారణంగా పెళ్లైన మర్నాడే ఆడవాళ్లు భర్తని మా ఆయన అనీ అత్తింటిని తన ఇల్లు అనీ భావించి కలిసిపోతుంటారు. అలా చెప్పుకుని గర్విస్తుంటారు కూడా.

కాని రమ కొంచెం ఎడంగానే ప్రవర్తించేదని చెప్పాలి. నా సామాను, తన సామాను అంటూ వేరు చేసి చూసేది. స్నేహితులకి కిచెన్ సామాగ్రి చూపిస్తూ 'ఇవన్నీ పెళ్లికి ముందే కొనుక్కున్నాను' అని గొప్పగా చెప్పేది. ఇహ పుట్టింటి వారు పెట్టిన మంచం, బీరువాల్లాంటి చిన్న చిన్న వాటినే ఎంతో మహత్తరమైనవిగా వర్ణించి చెప్పేది!

'ఎవరి పిచ్చి వాళ్లకి ఆనందంలే' అని సరిపెట్టుకున్నాను గాని, అసలు రమ మనస్తత్వమే చిత్రమైనదని మరో మూడ్నెల్లకి తెలిసింది.

"ఇంటి పేరు మార్చుకోడానికి ఓ ప్రొసీజర్ ఉంది. అప్లికేషనూ, అవీ తీసుకురానా?" అన్నానో రోజున.

"ఇంటిపేరు మార్చుకునే ఉద్దేశం లేదండీ."

"అదేవిటి? పెళ్లయ్యాక నా ఇంటి పేరే నీ ఇంటి పేరవ్వద్దీ కదా!"

"అవుననుకోండి. అయినా నాకు జన్మనిచ్చి, పెంచి పెద్దచేసి, చదువు చెప్పించి ఉద్యోగస్తురాల్ని చెయ్యడమేగాక, ఒకింటిదాన్ని కూడా చేసిన మా ఇంటి వారి పేరు

మీదే ఇకముందు కూడా పిలవబడాలని నా కోరిక. పైగా నా ఇండివిద్యువాలిటీని నిలుపుకోవాలని ఉంది. దయచేసి దీన్ని తలబిరుసుగానో, గర్వంగానో భావించొద్దు. అయినా షేక్స్పియరు అన్నట్టు పేరులో ఏముంది చెప్పండి?"

"చాలా ఉంది. చాలా చాలా ఉంది. నీకు నా మీద నమ్మకం లేదని చెబుతోంది. నువ్వు వేరు నేను వేరు అని చెప్పక చెబుతోంది. తల తిక్క ఆడవారి స్త్రీ వాద ఛాయలు నీలో ఉన్నాయని కూడా చెబుతోంది..."

"ఎందుకంత అప్‌సెట్ అవుతారు?"

"నన్ను చెప్పనీ. పెళ్లయ్యాక నీదీ, నాదీ అని ఉండకూడదు. గంగాయమునల్లా కలిసి ఒకటిగా ఒకే నదిగా ఉండాలి. అంతే తప్ప రేపు మన పిల్లల్ని అయోమయంలో పడేసేలా, వాళ్లని వాళ్ల ఫ్రెండ్స్ గేలి చేసేలా ఉండకూడదు. అనవసర ఆర్గ్యుమెంట్లొద్దు. నలుగురి నోళ్లలో నలిగి నవ్వులపాలవ్వక ముందే సర్నేమ్ మార్పు చేయించేసుకో."

"క్షమించండి. ఈ విషయంలో రాజీ పడదల్చుకోలేదు."

ఊహించని ఆమె జవాబు షాక్‌లా తగిలింది. ఆమెని నమిలి మింగెయ్యాలన్నంత కోపం వచ్చింది. చావగొట్టి చెవులు మూయాలన్నంత ఆవేశం వచ్చింది. అయినా అల్లరవడం ఇష్టం లేక నిగ్రహించుకున్నాను.

తనే దారిలో కొస్తుందిలెమ్మని రెండ్రోజులు మాట్లాడలేదు. ముభావంగా ఉండిపోయాను. తనేదో బతిమాలాలని, నచ్చచెప్పాలని ప్రయత్నించిందిగాని నా ప్రతిపాదనకి ఒప్పుకుంటున్నానని మాత్రం చెప్పలేదు!

మరో నాల్రోజులు గడిచాయి. ఇద్దరిలో ఎవరం దిగిరాలేదు. నాకు పంతం హెచ్చింది. రమకి బుద్ధి వచ్చేలా ఘాటైన సమాధాన మివ్వడానికి ఉపాయాన్ని అన్వేషించాను.

మరి రెండ్రోజులుంటే అమలు జరిపే వాడ్నేనేమో. కాని ఇంతలో మరో సంఘటన జరిగింది.

అనుకోకుండా మా చెల్లెలి పెళ్లి నిశ్చయమయ్యింది. కట్నానికీ, ఖర్చులకీ యాభై అరవై వేల వరకూ నేను సర్దాల్సి వచ్చింది. ఈ గొడవలో పడటంతో ఇంటిపేరు గొడవ మరుగున పడిపోయింది.

నా కెదురైన సమస్య గురించి రమకి వివరంగా చెప్పేను.

"సరే. ఇంటిపేరు మార్చుకోకపోయినా మా కుటుంబ సభ్యుల్లో కలిసిపోయానంటున్నావుగా. ఇంటి కోడలుగా ఏ మాత్రం బాధ్యత వహిస్తావో నువ్వే చెప్పు."

"నా సేవింగ్స్ ఇరవైవేల వరకూ ఉంది. పాతికవేల చిట్ ఉంది. అది పాడేద్దాం. చాలదంటే పీఎఫ్ లోను తీసుకుంటాను."

నా అంచనా తప్పనందుకు, నేనాశించిన రీతిలోనే రియాక్టైనందుకు చాలా ఆనందం కలిగింది. రమని అభినందనల్తో, ముద్దుల్తో ముంచెత్తాను.

రమ సహకారం వల్ల మా చెల్లి పెళ్లి నిర్విఘ్నంగా జరిగిపోయింది. పెళ్లిలో రమ చొరవనీ, పని పురమాయింపుల్నీ చూసి బంధువులు కూడా అభినందించారు. దాంతో నా అంత అదృష్టవంతుడు భూమ్మీదే లేడనుకుని పొంగిపోయిన మాటా యథార్థమే.

కాని నాకు తెలీని మరో పార్శ్వం ఆమెలో ఉందని ఆ తర్వాత గాని తెలీలేదు.

"వచ్చేవారం శలవు పెట్టండి. ఎల్టీసీ మీద మా ఊరెళ్దాం."

"మీ ఊరెందుకు? ఏ బెంగుళూరో వెళదాం."

"బ్యాంకు రూల్సు ప్రకారం ఓ రెండేళ్ల బ్లాకులో నేటివ్ ప్లేస్ కెళ్లాలి. మరో రెండేళ్ల బ్లాకులో దేశంలో ఎక్కడికైనా వెళ్లొచ్చు."

"అదో తిరకాసుందా. అయితే ఊరెళ్దాం. పెళ్లయ్యాక మావూరే నీ ఊరవుతుందిగా!"

"నేటివ్‌ప్లేస్ మార్పు చేసుకుంటే వెళ్లొచ్చు గాని పుట్టి పెరిగిన ఊర్ని మార్చుకోవడం నాకిష్టంలేదు."

"అది కాదు రమా. ఏదో కాగితాల మీద మార్చుకున్నంత మాత్రాన ఊరు మారిపోద్దా? మీ ఊరు మా ఊరెళ్ళే దార్లోనే ఉంది కదా. అంచేత నేటివ్ ప్లేస్ మార్చుకుంటే ఖర్చులు కలిసొస్తాయి. రెండు చోట్లకీ వెళ్లొచ్చు."

"ఆఫ్‌కోర్స్ - కానీ - సారీ, నాకిష్టం లేదండి. ఇదో సెంటిమెంటల్ ఫూల్ అనుకుని వదిలెయ్యండి."

ఆమె నైజం అర్థంగాక మ్రాన్పడిపోయాను.

అది జరిగిన కొద్ది రోజులకే రమకి ఆఫీసర్‌గా ప్రమోషనొచ్చింది. మనస్ఫూర్తిగా అభినందించాను. కాని ఆ తర్వాత తెలిసింది ప్రమోషన్‌తో పాటు ట్రాన్స్‌ఫర్ కూడా తప్పనిసరి అని.

ఒకళ్లొకచోట, మరొకళ్లు మరోచోట ఉండటం నాకిష్టంలేదు. పైగా నేను అసిస్టెంటుగా పనిచేస్తోంటే, తను ఆఫీసరవ్వడం బంధుమిత్రుల్లో గౌరవప్రదంగా ఉండదనిపించింది.

స్త్రీకి సంసారం ముఖ్యం. దాని తర్వాతే ఉద్యోగాలూ, ప్రమోషన్లూనూ. అంచేత ప్రమోషన్ని తిరస్కరించమని చెబుదామనుకున్నాను. కానింతలో నన్ను తెలివిగా ట్రాప్ చేసేసింది.

శనివారం సాయంత్రం ఆఫీసునుంచొచ్చేసరికి ఆమె కొలీగ్స్ అంతా వచ్చి ఉన్నారు. ప్రమోషన్ సందర్భంగా పార్టీ ఇవ్వడానికి పిలిచినట్టు అర్థమైంది. ఆమె వంక కించిత్తు కోపంగా, చిరాగ్గా చూశాను.

అవాళే ప్రమోషన్ ఆర్డర్ చేతికందిందనీ, పార్టీ ఇవ్వాలని పట్టుబట్టగా పిలవక తప్పింది కాదనీ వివరణ ఇచ్చింది.

సభ్యతా సంస్కారాలున్న వాడ్ని గనుక సీన్ సృష్టించకుండా వారితో కలిసిపోయాను. వాళ్లు రమ కన్నా నన్నే ఎక్కువగా అభినందించారు. ఆమె మెరిట్ టెస్ట్ పాసవ్వడానికి తనిచ్చిన ప్రోత్సాహమే కారణమన్నారు. భార్యకి ప్రమోషనొచ్చినందుకు ఈర్ష్యపడకుండా అభినందించిన గొప్ప మనస్సు మీది అన్నారు. ఇంట్లో మీ సహకారం లేకపోతే బ్యాంక్‌లో ఆమె అంత బాగా పనిచెయ్యగల్గేది కాదన్నారు. ఆమెకి ట్రాన్స్‌ఫర్ అయిన ఊరికి మారడానికి మీరు ట్రాన్స్‌ఫర్ ప్రయత్నాలు ప్రారంభించారా అని అడిగారు. మీకు యూనియన్లో పలుకుబడి ఉందిట కదా. తేలిగ్గానే ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటారని రమగారు చెప్పేరన్నారు.

అన్నీ వాళ్లే చెప్పి నా చేత తలాడింప జేసి ఆహా ఓహో అని అభినందించి వెళ్లేరు!

మరిహ వెనక్కి తగ్గలేక అయిష్టంగానే ప్రయత్నాలు మొదలెట్టాను. నా పలుకుబడి దృష్ట్యా రెండు నెలలకే ఆమె దగ్గరకి ట్రాన్స్‌ఫర్ చేయించుకోగల్గేను.

ఆమెది విలేజ్ బ్రాంచిలో ఉద్యోగం. నాది సమీప మండల కేంద్రంలో ఆఫీసు. అయినప్పటికీ ఆమె సౌకర్యార్థం పల్లెలోనే మకాంపెట్టి అక్కడ్నుంచి రోజూ షటిల్ చేసేవాడ్ని.

చిత్రమేమిటంటే ఒక్కరోజున కూడా 'మీరు నా గురించెంత కష్టపడుతున్నారండీ' అనెరగదు. ఉత్త స్వార్థపరురాలు. ఇల్లూ, వంటా చూస్తూ, బ్యాంకు పని చేస్తూ అప్పుల వసూళ్లకంటూ గ్రామాల్లో తిరుగుతూ ఎంతో అలసిపోతున్నట్టూ, ఇంటి బరువంతా తనే మోస్తున్నట్టూ ఫోజు కొట్టేది!

మగాడి కెన్నో సరదాలుంటాయి. పనులుంటాయి. అదేమీ గ్రహించేది కాదు. ఎప్పుడైనా కాస్త ఆలస్యంగా ఆఫీసునుంచొస్తే "పేకాట పూజ చేస్తూ కూర్చోకపోతే పెందలాడే వచ్చి కాస్త ఇంటి పని చూడకూడదూ?" అని విసుక్కునేది. ఆవిడ అభిప్రాయం స్పష్టం. సరదాకి కూడా నేను పేకాట ఆడకూడదు. ఫ్రెండ్స్‌తో తిరక్కూడదు. ఆవిడ ఆఫీసరు గనుక వంట పని నేను నెత్తినేసుకోవాలి.

"నీ లిమిట్స్‌లో నువ్వుండటం నేర్చుకో. మగాడు వంటా పెంటా చెయ్యడం మా ఇంటా వంటా లేదు."

"అక్కడికి ఉద్యోగాలు చెయ్యడం మీ ఇంట్లో ఉన్నట్టు!"

"షటప్. నేను మగాడ్ని. నేను చెప్పినట్లు నువ్వు వినాలి. అంతే." తీవ్రస్వరంతో హెచ్చరించాను.

కుక్కిన పేనులాగా ఉండిపోయింది.

అప్పులకోసం చాలామంది వచ్చి రమని కలిసెళ్తుండేవాళ్లు. రోడ్డు మీద కెళ్తే ఆమెకి చాలా గౌరవమర్యాదలు లభించేవి. పల్లెటూరి బైతులు నన్ను రమ మొగుడిగానూ ఓ డమ్మీగానూ చూసేవారు. నాకు చాలా హుమిలియేటింగా ఉండేదొక్కోసారి!

అయినా తొందరపడలేదు. ఉద్యోగం మాన్పించలేదు. అంది వచ్చిన అవకాశాల్ని కేష్ చేసుకోమని మాత్రం చెప్పేను. బంగారు గుడ్లు పెట్టే బాతుని కూడా కోసుకు తిందామనుకునే ఈ రోజుల్లో బంగారు గుడ్లు కూడా వద్దనే వెర్రిబాగుల వాళ్ళుండరన్నాను. కష్టమర్లు సంతోషంగా ఇచ్చే తృణమో, ఫణమో స్వీకరిస్తే తప్పు లేదన్నాను. ఆర్థికంగా ఎంతో ఎదగాల్సి ఉంది గనక. ఎన్నో కొనాల్సినవి ఉన్నాయి గనుక చిన్న చిన్న లంచాలు తీసుకోమని ప్రోత్సహించాను.

అదేదో పెద్ద నేరమైనట్లు ఫీలయ్యింది. నేనేదో హత్య చెయ్యమన్నట్లు చూసింది. క్షుద్ర కీటకంలా విదిలించేసింది చూపుల్తోనే!

రమ అమాయకత్వానికి జాలి పడ్డాను. ఇవాళ కాకపోతే రేపైనా దారికొస్తుందిలే అని సరిపెట్టుకున్నాను. మెల్లగా నేనే ఆమె పార్టీలతో పరిచయం చేసుకున్నాను. ఆమెకి తెలీకుండా వసూళ్ళు చెయ్యడం మొదలెట్టాను. ఆ డబ్బు గురించి ఆమెకి అనుమానం రాకుండా వేరేగా దాచేవాడ్ని కూడా.

మా పెళ్లై రెండేళ్లయ్యింది.

అప్పుడే పానకంలో పుడకలెందుకని ఇన్నాళ్ళూ కాంట్రాసెప్టివ్స్ వాడుతూ వచ్చాం. కాని మా వాళ్లు ముఖ్యంగా మా అమ్మ 'మనవడ్నెప్పుడిస్తార్రా' అంటూ పీకేస్తోంది. బంధుమిత్రులు కూడా 'ఆవిడింకా మామిడికాయ కావాలనడం లేదా మూర్తీ' అని వేళాకోళం పట్టిస్తున్నారు. కొందరైతే 'ఒకసారి డాక్టర్‌కి చూపించుకుంటే మంచిదోయ్' అని సలహా ఇచ్చి ఒళ్లు మండించారు.

అంచేత కుటుంబ నియంత్రణ పద్ధతులకి స్వస్తి చెప్పేద్దామన్నాను రమతో.

"పిల్లల కిప్పుడు తొందరేవిటండీ? మనకేమైనా వయసైపోయిందా ఏవిటి?!"

"ఏ వయసులో ఆ ముచ్చటన్నారు."

"ఆ వయస్సు రావడాని కింకా వ్యవధి ఉంది లెండి. ఇప్పుడే మన సరదాలని చంపుకోవడం ఎందుకూ? ఉన్నవి చాలవన్నట్లు కొత్త బరువులు ఎత్తుకోవడం ఎందుకూ?!"

"అంతేనా లేక, నీ అందం తరిగిపోతుందన్న భయమా? కొందరు డామేజింగా మాట్లాడుతున్నారన్నా విన్పించుకోవేం?"

"కొందరంతేనండీ. అలాటి వారిని పట్టించుకోవద్దు."

ఆమె మంకు పట్టు సంగతి తెలుసు గనుక ఆమెకి తెలీకుండా నేను చెయ్యాల్సింది చేశాను. ఫలితంగా ఆమెకి నెల తప్పింది.

ముఖం ఎర్రగా కాలిపోతూండగా, "మీరే ఏదో చేశారు" అంటూ నామీద విరుచుకు పడింది.

"ఏదో యాక్సిడెంటల్‌గా నిరోధ్‌కి చిల్లుపడిందేమో!"

"ఏం జరుగుంటుందో నేనూహించగలను. రేపే వెళ్లి అబార్షన్ చేయించుకుంటాను."

'ఛీ - నువ్వసలు ఆడదానివేనా? ప్రతి ఆడదీ వెంద నిండేక ఒడి నిండాలనుకుంటుంది. నువ్వేమిటిలా మాతృత్వపు వరం వద్దంటావ్? నీకక్కర్లేక పోవచ్చు గాని వంశాంకురం నాకు కావాలి."

"అదా మీ ఆలోచన! అయితే ఖచ్చితంగా ఆడపిల్లనే కంటాను!"

"ఆడపిల్ల గుండెలమీద కుంపటి. వెన్నుమీది కురుపు. తలమీద అప్పుమూట!"

'మిమ్మల్ని కన్నదీ మీరు కట్టుకున్నదీ ఆడది కాదా? ఎందుకీ వివక్ష?'

"అందుకే నువ్వంటే ఒక్కోసారి అసహ్యమేస్తూంటుంది. ప్రతిదానికీ మొగుడితో అర్గ్యుమెంట్లేనా? మగాడు చెప్పడం. ఆడది వినడం చేసినప్పుడే ఏ సంసారమైనా సుఖంగా, సంతోషంగా ఉంటుంది. ఫర్ యువర్ ఇన్ఫర్మేషన్ చెబుతున్నాను. మొదటిసారి అబ్బాయే పుడతాడు. అది మా వంశ లక్షణం."

"అయితే ఎబార్షన్ చేయించుకుంటాను."

కోపాన్ని కంట్రోల్ చేసుకోలేకపోయాను. ఫలితంగా నా చేతి వేళ్ల ముద్రలు ఆమె చెంపల మీద పడ్డాయి. ఏడుస్తూ ఏదేదో వాగింది.

" ఇంకొక్క మాట మాట్లాడితే పీక పిసికి చంపేస్తాను. జాగ్రత్త!" అని బెదిరించే సరికి నోరు నొక్కుకుంది.

తోట కూర నాడే - సామెతలా మొదట్లోనే నేను గట్టిగా చెప్పి ఉంటే రమలో ఇంత అహంకారం బలిసేదికాదు. అందుకే ఆడదాన్ని చెప్పు కింది తేలులా అణచి ఉంచాలంటారు. లేకుంటే మగాడ్ని చీరకొంగుకి ముడేసుకుని బొడ్లో దోపుకుంటుంది!

ఆ మర్నాడు మా అత్తామామలొచ్చారు. విషయం విని రమ మీద కూకలేసి నాకు క్షమాపణలు చెప్పేరు. చిన్న పిల్ల, క్షమించమని కోరారు. ఆ రకంగా ఆ తుఫాను సద్దుమణిగింది.

కాని మరో ప్రళయం కాచుకుని ఉందని నాకేం తెలుసు?

మా ఆఫీసు ఉద్యోగులం కొందరం కలిసి చవగ్గా స్థలం కొని ప్లాట్స్‌గా విభజించుకున్నాం. రమ పార్టీల నుండీ, నా పార్టీలనుండి వసూలు చేసిన సొమ్ము అందుకు ఉపయోగపడింది.

“మీ బ్యాంకు ద్వారా అప్పిప్పించు. ఇల్లు కట్టేద్దాం.” అన్నాను రమతో.

“స్టాఫ్‌కి హౌసింగ్‌లోన్సు ఇస్తారు. స్థలం, ఇల్లూ నా పేరన ఉండాలి....”

ఒక్క క్షణం మిర్రి చూసి, “సరే అలాగే కానిద్దాం. స్థలం నీ పేరుమీద రిజిస్ట్రేషన్ చేసేస్తాను. ఎవరి పేరైతేనేం?” అన్నాను.

సంబరంగా అంగీకరించింది గాని మాట వరసక్కూడా నన్నభినందించలేదు. అసలు ఇతరుల గొప్పతనాన్ని గుర్తించడం, గౌరవించడం ఆమెకి తెలీదేమో అన్పిస్తోంది!

బ్యాంకు రెండు లక్షలిచ్చింది. కొన్ని చిల్లర మల్లర అప్పులూ, చేబదుళ్లూ కూడా చేసి ఎలాగైతేనేం, చక్కని చిన్న డాబా కట్టుకుని ఆర్భాటంగా గృహప్రవేశం చేశాం.

బంధుమిత్రులంతా రమకి లోన్ రావడం వల్లే చక్కని ఇల్లు కట్టుకోగలిగారని అభినందిస్తోంటే - చెప్పొద్దూ, నాకు చాలా ఉక్రోషంగా అన్పించింది. నేను చాలా సొమ్ము సర్దేనని అడిగినవారికీ, అడగని వారికీ చెప్పేను. పై అప్పులు కూడా నేనే చేశానన్నాను. కాని నా మాటల్ని నమ్మినవాళ్లు చాలా తక్కువ.

“ఆవిడగారు రెండు చేతులా సంపాదిస్తోంది మరి. ఎన్ని సోకులైనాపోతారు. ఎన్ని ఇళ్లైనా కడతారు.” అందొకావిడ!

ఆ మాటలు రమ కూడా విన్నది.

ఆ రాత్రే చిన్న క్లాసు తీసుకున్నాను. “నువ్వు చాలా సిన్సియర్‌వి. లంచాల వంకే చూడవు. ఆ సంగతి అందరికీ తెలుసు. అయినా లోకులు ఎలా అనుకుంటున్నారో విన్నావుగా. అంచేత వాళ్ల మాటల్నే నిజం చేసేస్తే త్వరగా మన అప్పులు తీరిపోతాయి.

పుట్టబోయే మన బిడ్డకి ఇళ్లూ, తోటలూ, కార్లూ ఇవ్వొచ్చు. నీకు తెలుసు కదా. కొడుకు బొమ్మకార్ల ఫ్యాక్టరీ అడిగితే నిబంధనల్ని గాలి కొదిలి కార్ల ఫ్యాక్టరీయే ఇచ్చేసింది ఇందిరాగాంధీ. కన్న ప్రేమంటే అదే మరి."

"నేనలా ఇవ్వాలనుకోవడం లేదు. విద్య, శీలం, ఆత్మవిశ్వాసం - ఈ ఆస్తులే ఇస్తాను నా పిల్లలకి."

"ఊరికే విర్రవీగకు..."

"ష్. పడుకోండి. ఎవరైనా వింటే బాగోదు. ఇంటి నిండా బంధువులున్నారు"

దుప్పట్లో దాక్కుండిపోయింది. లేకపోతే నా చూపుల శాపాలకి మాడి మసైపోయేదే!

గృహప్రవేశానికి వచ్చిన నాన్నా వాళ్లూ వెళ్తోంటే సాగనంపడానికి స్టేషన్ దాకా వెళ్లేను. రైలెక్కే ముందన్నారు నాన్న "ఇంటి తాళాలు ఆవిడ చేతిలో పెట్టినట్టున్నావు. జాగ్రత్తరా అబ్బాయ్. స్త్రీ బుద్ధి ప్రళయాంతకం అన్నారు."

నా గుండె గుభిల్లుమందొక్కసారే.

'ఈ ఇల్లు నీది కాదు నాది' అని రమ అంటే నేను భరింగలనా? సహించగలనా? నో నెవ్వర్!

ఆ స్థలం నాది. ఆ ఇల్లు కట్టించిన శ్రమనాది. ప్లాను అప్రూవ్ చేయించడానికి, కరెంటు కనెక్షన్‌కి, సిమెంటు రాయీ కొనటానికి విశ్రాంతనేది లేకుండా తిరిగింది నేను. ఎన్నో వాటికి ఎన్నో రకాలుగా డబ్బు సర్దింది నేను. రేయింబవళ్లు కనిపెట్టుకునుండి అన్నీ అమర్చి, అందర్నీ కూడగట్టి ఇల్లు పూర్తయ్యేలా చేసింది నేను. అలాటిది ఇల్లు నా పేరన లేనంత మాత్రాన నాది కాకుండా ఎలా పోతుంది? ఎలా పోనివ్వగలను?

ఏమైనా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మంచిదేమో అన్పించింది. రమ నాకు అమ్మేసినట్టు ఏదో వంకన అగ్రిమెంటు లాంటిది రాయించేసుకుంటే మంచిదన్పించింది. ప్లీడర్ని సంప్రదించగా ఆయనా అదే సలహా ఇచ్చాడు.

నా ఉపాయం అమలు పరిచేంతలో నా కాళ్లకి బంధం వేసేసింది రమ!

సెంటు స్ప్రే చేసిన తెల్ల చీర కట్టుకుని, మల్లెపూలు పెట్టుకుని, సమ్మోహనంగా నవ్వుతూ రతిదేవిలా గదిలోకి అడుగుపెట్టింది.

"ఏమిటివాళ దేవకన్యలా మెరిసిపోతున్నావ్?" పొగడ్తలకి లోబడని ఆడవాళ్లుండరు గనుక ఆ మార్గం ఎంచుకున్నాను.

"ఇవాళ చాలా ఆనందంగా ఉందండీ. ఒక మంచి కార్యానికి శ్రీకారం చుట్టగలిగాను. మీరేమీ అనరనే ధైర్యంతో మీకు తెలీకుండా ఓ సాహసం చేశాను."

"నువ్వేం చేసినా రీజన్ ఉంటుంది. నువ్వు చాలా తెలివైన దానివని ఎప్పుడో ఒప్పేసుకున్నాగా. ఇంతకీ ఆ ఘనకార్యమేమిటో చెప్పు." నా పథకం అమలు చెయ్యడానికిదే అదనని భావించి అందుకు రంగం సిద్ధం చేస్తూ అన్నాను.

"అతి కష్టం మీద మా చెల్లాయి పెళ్లి కుదిరిందని మీకు తెలుసుగా. నాన్న పెన్షనర్. లాంఛనాలకీ, పెళ్ళి ఖర్చుకీ డబ్బులేదని బాధపడుతున్నారు. అందుకని యాభైవేలు సర్దుతానని మాట ఇచ్చాను."

"నీకేమైనా మతిపోయిందా? యాభై వేలంటే ఏమిటనుకుంటున్నావ్? చిల్ల పెంకులు కావు. రూపాయలు! ఎలా తీరుస్తారని మాట ఇచ్చావ్?"

"వాళ్లు తీర్చలేరు. మనమే తీర్చాలి."

"ఏంటీ? ఎవడో కని పారేసిన దాని పెళ్లికి మనం యాభై వేలివ్వాలా? నేను చచ్చినా ఒప్పుకోను!"

"ఛ! అసహ్యంగా మాట్లాడకండి. అది ఎవరో అనాథ కాదండీ. నా తోడబుట్టిన చెల్లెలు."

"పుట్టింటి గడప దాటగానే ఆ అనుబంధానికి అర్థం మారిపోతుంది."

"ఎందుకు మారుతుంది? నేను ఆ తాను గుడ్డను కాదా?"

"ఊరికే అడ్డంగా వాదించి నన్ను రెచ్చగొట్టకు. నువ్వు డబ్బు ఇవ్వడానికి వీల్లేదంతే. నీకు తెలుసో లేదో ఏ తల మాసినవాడూ మనకంత అప్పు ఇవ్వడు. ఏమిటనుకున్నావో."

"మా బ్యాంక్ అనుబంధ సంస్థ ఎడిషనల్ హౌసింగ్ లోన్ ఇస్తుంది. ఇదే ఇంటిమీద అదనపు పనుల కోసమని చెప్పి యాభై వేలకి ఇవాళే అప్లైచేశాను."

"ఓహో! అప్పుడే అన్ని ముగ్గులూ పెట్టేసి కేవలం శంఖంలో పోయడానికి నాకు చెతున్నావన్నమాట. భేష్, బాగుంది. నేననుకుంటున్న దానికన్నా బాగా ముదిరిపోయావన్న మాట. ఒసేయ్! ఈ ఇల్లు నీ బాబు సొమ్ము కాదే తగుదునమ్మా అని ఇంకో తాకట్టు పెట్టి అప్పు చెయ్యడానికి! మైండిట్!"

"ఈ ఇల్లు నా బాబుది కాకపోవచ్చు. కాని నాది."

"నోర్ముయ్! ఇంకోసారలా వాగావంటే నిలువునా చీరేస్తాను. నరికి పోగులు పెట్టేస్తాను."

"ఎందుకలా అరుస్తారు? సంస్కారహీనంగా ప్రవర్తించకండి..."

"అబ్బో! గొప్ప సంస్కారిణి ఆకాశం నుంచి దిగి వచ్చిందండీ. మొగుణ్ని గడ్డి పరకలా చూసే ఈవిడ, మొగుడి ఇంటి పేరు తగిలించుకోవడం అవమానంగా భావించే ఈవిడ, పిల్లల్ని కంటే అందం తరిగిపోద్దని తలచే ఈవిడ నీతులు చెబుతోంది వినండి! చప్పట్లు కొట్టండి!!"

"దారుణంగా మాట్లాడకండి!"

"ఇంక మాట్లాడను. మాట్లాడనివ్వకుండా ప్రవర్తిస్తాను. అప్పు సంగతి మర్చిపోతావా? లేక కాపురాన్ని కాలదన్నుకుని వెళ్లిపోతావా?"

"ఏమండీ, కొంచెం నా మాట వినండి."

"వినను. అదో ఇదో తేల్చి చెప్పు. కమాన్..."

"వెళ్లాల్సిన పరిస్థితే వస్తే వెళ్లాల్సింది నేను కాదు!"

రమ మాటలు నిప్పుల మూటలై వచ్చి నా ముఖాన్ని బలంగా తాకాయ్! ఉవ్వెత్తు కెరటాలై చుట్టేశాయి!

నా మగరక్తం సలసల మరిగింది. పురుషాహంకారం పడగవిప్పి బుసలు కొట్టింది.

"యూ బ్లడీ బిచ్! గెటవుట్! గెటవుట్ ఫ్రం మై హౌస్"

రమని బయటికి తోసేశాను!

వేలు చురుక్కుమంది. సిగరెట్ పీకని వదిలేశాను. గడియారం వంక చూశాను. రమని గెంటేసి గంట పైనే అయ్యింది.

ఆమె ఎక్కడి కెళ్లిందో! ఏం చేస్తోందో!

తన ఇంట్లోంచి తనని అక్రమంగా గెంటేశానని ఇరుగు పొరుగుకి చెప్పి కన్నీళ్లతో లోబరుచుకుని వాళ్లందర్నీ నామీద దాడికి తీసుకొస్తుందా?

లేక దౌర్జన్యం చేశానని పోలీసులకి కంప్లెయింట్ ఇస్తుందా?

అదీ ఇదీ గాక, ముఖం చెల్లక, పుట్టింటికి పారిపోయి ఉంటుందా?

అసలే చదువుకుంది. తెలివైంది. ఆపైన ఆఫీసరుద్యోగం వెలగబెడుతోంది. ఏం చేస్తోందో ఏమో!

సన్నగా ముచ్చెమటలు పోస్తోంటే అశాంతిగా కలయతిరుగుతూ మరో సిగరెట్, ఇంకో సిగరెట్ వెలిగించాను.

రాత్రి వేళ అని కూడా చూడకుండా బయటికి గెంటెయ్యడం అంతా చూసే ఉంటారు. రమ సిగ్గుతో చితికిపోయి ఉంటుంది. అవమానం భరించలేక ఏ ఆత్మహత్యకో తలపడి ఉంటుంది.

అదే నిజమై, ఎవరైనా వచ్చి 'మీ ఆవిడ ఆత్మహత్య చేసుకుని చనిపోయిందండీ' అనే తియ్యని కబురు చెబితే ఎంత బావుణ్ణు!

తలచినదే జరిగితే?

ఈ ఇల్లు నా సొంతమవుతుంది. రమ తాలూకు పీ.ఎఫ్., గ్రాట్యుటీ, ఇన్సూరెన్స్, సమస్త బెనిఫిట్సూ నాకే వచ్చేస్తాయి. కాని... ఆమె కడుపులో పెరగుతున్న బిడ్డ... వంశాంకురం...వాడ్ని కని ఆత్మహత్య చేసుకుంటే బావుణ్ణు–పోనీలెద్దూ, నెల తిరక్కుండా మళ్లీ పెళ్లి చేసుకోనా, పిల్లల్ని కననా!

ఈసారి మాత్రం మళ్లీ పాత తప్పు చెయ్యకూడదు. పెద్దగా చదువుకోని పల్లెటూరమ్మాయిని పెళ్లి చేసుకోవాలి. వాళ్లైతేనే మొగుడ్ని ప్రత్యక్షదైవంగా చూస్తారు. పూజిస్తారు. వాళ్లకి సొంత సంపాదన, సొంత వ్యక్తిత్వం ఉండవు గనుక కొట్టినా, తిట్టినా నీవే శరణంటూ కాళ్ల దగ్గర పడి ఉంటారు.

అదే రమలాగా చదువుకున్న అమ్మాయిలైతే 'నువ్వేంటి బోడి!' అని తీసి పారేస్తారు. 'ఛీ కుక్కా' అంటే 'ఏమే అక్కా' అని బదులిస్తారు. ఇహ ఉద్యోగాలో, వ్యాపారాలో చేసే వాళ్లైతే 'నీ లెక్కేమిటి ఫో బే' అనేస్తారు!

అంచేత ఆడది ఎక్కువగా చదువుకోకూడదు. తన కాళ్లమీద తను నిలబడకూడదు. తెలివిగా ఆలోచించనివ్వకూడదు. అసలు స్వేచ్ఛ అనే పదార్థపు వాసన కూడా సోకనీకూడదు. అప్పుడే మగవాడు మొనగాడవుతాడు. వాడి అహం ఆభరణమవుతుంది. అతగాడు మగ మహారాజవుతాడు!

అవునంతే! ఆడది అక్షరాలా పతివ్రతలా ఉండాలి. మనసా వాచా కర్మణా పతినే పూజించాలి!

'నీ శీలం మంచిదో కాదో అగ్నిలోకి దూకి నిరూపించుకో' అంటే మారు మాట్లాడకుండా అగ్నిలోకి దూకెయ్యాలి.

'నా అప్పు తీర్చడానికి అంగట్లో అమ్మేస్తా' నంటే 'చిత్తం ప్రభూ' అనాలి.

'నా పౌరుషం నిలబెట్టాటానికి జూదంలో పందెం కాస్తా' నంటే పావులా ఒదిగిపోవాలి!

'నీ గురించెవడో ఏదో కూశాడు. నువ్వు నాకక్కర్లేదు. అడవిలోకి పోయి అఘోరించు. అలాగని చావొద్దు. నీ కడుపులో ఉన్న నా వారసుడ్ని నాకప్పజెప్పేక నీ చావు నువ్వు చావు. ఛో' అని శాసిస్తే కన్నీళ్లు మింగుతూ, ఎవరికీ ముఖం చూపించకుండా అడవులు పట్టుకుపోవాలి!

చటుక్కున నా మెదడులో అద్భుతమైన మెరుపు మెరిసింది! ఇంత వరకూ నన్ను పట్టి పీడిస్తున్న భయాలన్నీ ఒక్కసారే మంత్రించినట్లుగా మాయమైపోయాయి.

గుండె దూది పింజకన్నా తేలికైపోయింది. ప్రభుదేవాలా డాన్స్ చేశాను. 'నీకు దడ – దడ –' అని పాడాను.

ఇంకా ఈ కథ ముగింపు గురించి చెప్పేదేముంది?

రమ రేపు నా మీద తగువుకి ఎవర్నైనా వెనకేసుకొస్తే ఒకే ఒక్క డైలాగ్ చెబుతాను.

ఆమె ఎవర్తోనో తిరిగి గర్భం తెచ్చుకుందంటాను. నేను ఉపయోగించిన కుటుంబ నియంత్రణ సాధనాల మీద ఒట్టేస్తాను!

గాలి విత్తితే సుడిగాలి మొలుస్తుంది కదా?!

ఆ చిన్న నింద బాంబై పేలుతుంది. ఆమెని నిలువునా కూల్చేస్తుంది.

ఆ అభియోగానికి అభిమానవతి అయిన ఏ ఆడదైనా సరే, ఆత్మహత్య చేసుకుని తీరుతుంది!

నేను కొత్త పెళ్లి కొడుకునైపోతాను.

దట్సాల్!

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)

**9.4.1997**